# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 167 | విశాఖపట్నం | 19-3-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 167 | VISAKHAPATNAM | 19-3-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram












# 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించిన చంద్రబాబు






**అమరావతి, పతాకం న్యూస్:** దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం ఉగాది కానుక ఇచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో వీరికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే దివ్యాంగ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా 12.76 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. ఉగాది కానుకగా ఆర్టీసీ బస్సుల్లో వారికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే దివ్యాంగ శక్తి పథకాన్ని మంగళగిరి బస్టాండ్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంగళగిరి నుంచి ఉండవల్లి వరకు బస్సులో దివ్యాంగులతో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు ప్రయాణించారు. బస్సులో వెళ్తూ ప్రజలకు అభివాదం చేశారు. దివ్యాంగ శక్తి పథకం ద్వారా ఏపీవ్యాప్తంగా 11.16 లక్షల మంది దివ్యాంగులు ఉచిత ప్రయాణం చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ పథకం ద్వారా మొత్తం 12.76 లక్షల మందికి దివ్యాంగులు, వారి సహాయకులకు లబ్ధి చేకూరనుంది. దివ్యాంగులకు సహాయకులుగా వచ్చే వారికి 50 శాతం టికెట్ రాయితీ ఇవ్వనుంది. 40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులకు ఈ పథకం వర్తిస్తుంది. దీని అమలు కోసం ఏడాదికి రూ. 207 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించనుంది. ప్రయాణం అనంతరం దివ్యాంగులకు తన నివాసంలో సీఎం చంద్రబాబు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. (తరువాయి 2వ పేజీలో)



3లో


**రాష్ట్రాలకు కేంద్రం 10 శాతం అదనపు కమర్షియల్ ఎల్పీజీ**

**జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే..!**



6లో


5లో



**ఆదివాసీల ఇళ్లకు అదనపు సాయమేది?**



బుధవారం విశాఖలో జరిగిన టీజేఎఫ్ ఉత్సవాలులో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు,టీజీఎఫ్ ఫౌండర్ ఈశ్వర్ చౌదరి, వైసిపి నేత దొడ్డికిరణ్, పతాకం న్యూస్ ఎడిటర్ డాక్టర్ లెక్కల శ్రీనివాస్



జనసేన పార్టీ కందుల నాగరాజుతో
పతాకం న్యూస్ ఎడిటర్ డాక్టర్ లెక్కల శ్రీనివాస్



బి ఆర్ కే న్యూస్ ఎండి రాజేంద్రతో
పతాకం న్యూస్ ఎడిటర్ డాక్టర్ లెక్కల శ్రీనివాస్

## 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురుతో
# భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత జెండా కలిగిన 'జగ్ లాడ్కి' అనే ముడి చమురు నౌక బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకను పుజైరా పోర్టులో లోడ్ చేశారు. 'జగ్ లాడ్కి' మొత్తం పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే మనవద్ద ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. మార్చి 14న పుజైరాలోని ఆయిల్ టెర్మినల్‌పై ఇరాన్ దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. 'జగ్ లాడ్కి' అదే సమయంలో అక్కడ ఇంధనం నింపుకుంటోంది. ఇంధనం నింపుకున్న అనంతరం ఈ నౌక అక్కడి నుంచి బయలుదేరి సురక్షితంగా భారత్ చేరుకుంది. ముర్బన్ క్రూడ్‌తో నిండిన ఈ నౌక మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది. ఇప్పటికే శివాలిక్, నందాదేవి నౌకలు హర్మూజ్ జలసంధిని గుండా ప్రయాణించి సురక్షితంగా భారత్ చేరుకున్నాయి. ఈ నౌకలు ఎల్పీజీ గ్యాస్‌ను తీసుకువచ్చాయి. సముద్రమార్గంలో జరిగే చమురు రవాణాలో ఐదవ వంతు హర్ముజ్ జలసంధి ద్వారా ఉంటుంది.

# ఏఎస్ఐ అనుమానాస్పద మృతి



**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** కృష్ణా జిల్లా యనమలకుదురులో ఏఎస్ఐ అనుమానాస్పదంగా మృతి చెందారు. పడమట పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా చేస్తున్న వీరవల్లి గోపి వెంకట దుర్గాప్రసాద్ (54) ఒక కేసు విషయంలో 15 రోజుల క్రితం సస్పెన్షన్ కు గురైన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైనన్నారు. ఈ క్రమంలో యనమలకుదురు కరకట్ట శివారు ఒక పాకలో శవమై తేలారు. ఘటన స్థలానికి చేరుకున్న పెనమలూరు పోలీసులు హత్య లేక ఆత్మహత్య అన్న కోణంలో విచారణ చేస్తున్నారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఆందోళన

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ ప్రారంభించిన దాడులు 19వ రోజులో ప్రవేశించాయి. వాటికి దీటుగా టెహ్రాన్ కూడా ప్రతి దాడులతో బెంబేలెత్తిస్తున్నది. హోర్ముజ్ జలసంధి ప్రాంతానికి వచ్చి అక్కడి నుంచి నౌకలకు రక్షణ కల్పించాలన్న ట్రంప్ కోరికను ఏ ఒక్క మిత్ర దేశం కూడా అంగీకరించలేదు. ఇది తమ యుద్ధం కాదని బయటకు చెప్పకుండానే ముఖం చాటేస్తుండటంతో ట్రంప్‌కు దిక్కుతోచక పిచ్చి ప్రేలాపనలకు దిగాడు. అమెరికా దాడులు ప్రారంభమైనప్పటి నుంచీ కొంత మంది అమెరికాకు వ్యతిరేకంగా ఇరాన్ పక్షాన చైనా, రష్యా ఎందుకు దాడుల్లో పాల్గొనటం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నకు కాలమే సమాధానం చెప్పింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా తమతో కలసి దాడులకు పూనుకోవటంలేదని డోనాల్డ్ ట్రంప్ తన మిత్ర దేశాల మీద తిట్ల పురాణం ప్రారంభించాడు. చివరికి చైనా గనుక హోర్ముజ్ జలసంధికి యుద్ధ నౌకలను పంపి ఇరాన్‌ను కట్టడి చేయకపోతే ఈ నెలాఖరులో బీజింగ్ పర్యటనను వాయిదా వేసుకుంటానని చైనాను కూడా బెదిరించాడు. మాకేం తొందరలేదు, వస్తే రా, లేకపోతే లేదు నీ ఇష్టం అన్నట్లుగా చైనా ఉంది. నాటోలో ఉన్న దేశాలే కాదు, ఇరాన్ దాడులకు గురవుతున్న గల్ఫ్ దేశాలు కూడా యుద్ధంలో దిగేందుకు అంగీకరించటం లేదు.ఇరాన్‌పై దాడులు ఎప్పుడు ముగుస్తాయన్నది మరొక ప్రశ్న. ప్రారంభించిన అమెరికాకే దిక్కు తోచటం లేదు. ఇరాన్ వైపు నుంచి ఇలాంటి ప్రతిఘటన ఉంటుందని తనకెవరూ చెప్పలేదని, నెపాన్ని డోనాల్డ్ ట్రంప్ స్వయంగా సలహా దారులు, నిఘా యంత్రాంగం మీద నెట్టేందుకు పూనుకున్నాడు. అయితే అలాంటిదేం లేదు, ముందుగానే ట్రంప్‌కు హెచ్చరికలు అందాయని వార్తలు. ఒకవైపు ఇరాన్‌లో వేలాది కేంద్రాలపై దాడులు చేశామని, దాని మిలిటరీ నడ్డి విరిచామని రోజూ డోనాల్డ్ ట్రంప్ చెబుతుంటాడు. అదే నిజమైతే జరుగుతున్న క్షిపణి దాడుల సంగతేమిటన్న ప్రశ్నకు సమాధానం చెప్పేవారు లేరు. మొత్తంగా నాశనం చేశావని ఎలాగూ చెప్పావు కదా. ఇంక చేయాల్సిందేమీ లేదని గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించవచ్చు కదా అని ట్రంప్ మిత్రుడే బహిరంగంగా చెప్పిన తరువాత కూడా అలాంటి చర్యకు పూనుకోలేదు. ఎవరికైనా మదం తలకెక్కినపుడు హితవచనాలు రుచించవు. పశ్చిమాసియా యుద్ధంలో పాల్గొనే ఉద్దేశం తమకు లేదని జర్మనీ పేర్కొన్నది. హోర్ముజ్ జలసంధిలో నౌకల రక్షణకు మిలటరీని పంపాలనే కోరిక తమకు లేదని స్పష్టం చేసింది. ఆసియాలో అమెరికా అనుయాయి దేశం దక్షిణ కొరియా, అక్కడ అమెరికాకు తొమ్మిది మిలిటరీ కేంద్రాలు, వాటిలో అన్ని దళాలకు చెందిన 25 వేల మంది సైనికులు ఉన్నారు. తాము కూడా హోర్ముజ్‌కు నౌకాదళాన్ని పంపటం లేదని అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. తమ దేశంలో నిల్వ ఉంచిన ఆయుధాలను పశ్చిమాసియాకు తరలిం చారని, దీన్ని అవకాశంగా తీసుకొని ఉత్తర కొరియా దాడి చేస్తే తమ పరిస్థితి ఏమిటని కొద్ది రోజుల క్రితం దక్షిణ కొరియా అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఇంధన ఉత్పత్తుల ఎగుమతులపై పరిమితులు విధిం చనున్నట్లు చెప్పాడు. నౌకలను పంపే అంశం పరిశీలనలో లేదని జపాన్ ప్రధాని తకాయిచి పార్లమెంటులో చెప్పారు. ఆస్ట్రేలియా కూడా అదే బాటలో ఉంది. ఐరోపా యూనియన్ విదేశాంగ మంత్రి కాజా కలాస్ మాట్లాడుతూ ఇప్పుడు జరుగుతున్న చర్యలను మార్చాలనే కోరిక ఇప్పటికైతే తమకు లేదని చెప్పాడు. బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ కూడా తమ దేశం విస్తృత యుద్ధంలోకి రాదని అన్నాడు. ఇలా వుండగా...యుద్ధ లక్ష్యాల గురించి ట్రంప్ మాట మార్చాడు. తాము ముడి చమురు కోసం ఇరాన్ మీద దాడి చేయలేదని ట్రంప్ చెప్పుకున్నాడు. హోర్ముజ్ జలసంధిలో నౌకలు స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా తమ మిత్ర దేశాల కోసమే దాడి చేసినట్లు మాట మార్చాడు. అందుకుగాను ఆ ప్రాంతంలో రక్షణ కోసం చైనా, జపాన్ వంటి దేశాలు యుద్ధ నౌకలను పంపాలని అన్నాడు. తమకు చమురు అవసరం లేదని, కావాల్సిన దానికంటే రెండింతల ఎక్కువ ఉందని, మా మంచి మిత్రుల కోసమే దాడి చేశామని అన్నాడు. నిజానికి ఇతర దేశాలను రక్షించాలని తప్ప మా కోసం దాడులు చేయటం లేదన్నాడు. తమ మిత్ర దేశాలు ముఖ్యంగా నాటో దేశాల వైఖరి ఆశాభంగం కలిగించిందని ట్రంప్ చెప్పాడు. మేం మాత్రం వారికోసం ఎల్లవేళలా ఉండాలి, కాని వారు మాత్రం మాకోసం రారు అంటూ బి-2 స్పిరిట్ బాంబరు బొమ్మను చూపుతూ హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు మాకు ఎవరి అవసరమూ లేదని ఊగిపోయాడు. తమకు సహకరించకపోతే నాటోకు రానున్నది చెడు కాలమన్నాడు. ఇరాన్‌పై దాడులను ప్రారంభించినప్పటి నుంచి గల్ఫ్, ఇతర దేశాలను యుద్ధంలోకి లాగాలని అమెరికా తీవ్రంగా చేస్తున్న ప్రయత్నాలకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఇరాన్ వైపు నుంచి క్షిపణుల వర్షం కురుస్తున్నప్పటికీ ప్రత్యక్షంగా దాడులకు గల్ఫ్ దేశాలు పూనుకోలేదు. అమెరికాను నమ్మి, నిజంగా తమ దళాలను రంగంలోకి దింపితే తలెత్తే పర్యవసానాల గురించి పైకి చెప్పుకోవటం లేదుగానీ అవి తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.

## దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన మంత్రి నారా లోకేశ్




**అమరావతి, పతాకం న్యూస్:** దివ్యాంగుల గౌరవం పెంచేలా ప్రజా ప్రభుత్వం కృషిచేస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించారు. మంగళగిరి బస్ స్టేషన్ నుంచి పెనుమాక వరకు దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ప్రయాణించారు. అనంతరం ఉండవల్లి నివాసంలో 'దివ్యాంగ శక్తి పథకం' లబ్ధిదారులతో జరిగిన ఆత్మీయ విందు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులను ఆత్మీయంగా పలకరించిన మంత్రి లోకేశ్, తన పక్కన కూర్చొన్న శివనాగరాజు, సౌభాగ్య, ఖాశీంబి, అన్నపూర్ణమ్మలతో మమేకమై మాటామంతీ కలిపారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగుల గౌరవం పెంచాలని, వారిలో పట్టుదల ఎక్కువ అని అన్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. వికలాంగుల ఆత్మగౌరవం ముఖ్యమని లోకేశ్ పేర్కొన్నారు. సమాజంలో కూడా మహిళలను కించపరిచే పదాలను అందరూ విడనాడాలని, ఇందుకోసం తాను పోరాడుతున్నానని అన్నారు. "కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే డీఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేశాం. ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేస్తున్నాం. ఇకపై ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు రావడం ద్వారా ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి కల్పన జరుగుతుంది. అందుకే అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నాం. మంగళగిరిలో ప్రభుత్వ భూమి లభ్యత చాలా తక్కువగా ఉంది. అందుకే కాజా వద్ద 75 ఎకరాల భూమి కొనుగోలు చేస్తున్నాం. మంగళగిరికి 4,5 ఐటీ కంపెనీలను తీసుకువస్తాం. సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తుంది" అని లోకేశ్ తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. వారితో కలిసి ఫోటోలు దిగారు.

## ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దని నిరసన




**సత్తెనపల్లి, పతాకం న్యూస్:** ఇళ్ల మధ్య మద్యం దుకాణాన్ని పెట్టొద్దని మహిళలు ఆందోళన చేపట్టారు. సత్తెనపల్లి పట్టణంలోని లక్కరాజు గార్లపాడు బస్టాండు సెంటర్లో గీతా మందిరం ఎదురు మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నట్లు తెలుసుకున్న స్థానిక మహిళలు నిరసన ర్యాలీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఏడాది క్రితం ఇదే స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయాలని చూడగా అప్పుడూ స్థానిక మహిళలు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేయకుండా చూశారు. అయితే మళ్లీ అదే ప్రాతంలో మద్యం దుకాణ ప్రయత్నాలు ప్రారంభించడంతో సోమవారం నరసరావుపేటలో కలెక్టర్ గ్రీవెన్స్‌లోనూ వినతిపత్రం ఇచ్చి పట్టణంలోనూ గడియారం స్తంభం వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.

## 'దివ్యాంగ శక్తి' పథకంపై అచ్చెన్నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య మిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఇటీవల ప్రారం భించిన 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా దివ్యాంగులు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయా ణస్తూ ఎంతో లబ్ధిపొందు తున్నారన్నారు. చరిత్రలో దివ్యాంగులకు ఎప్పుడు మేలు జరిగినా అది సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమైందని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'దివ్యాంగులకు సమాజంలో ప్రత్యేక గౌరవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఆగస్టు 15న ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం అద్భుత విజయాన్ని అందుకుంది. అదే బాటలో ఇప్పుడు 'దివ్యాంగ శక్తి' సూపర్ హిట్ అవుతుంది. ఇప్పటివరకు దాదాపు 150 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించారంటే ఈ పథకం ఎంతటి ఘన విజయం సాధించిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో మొత్తం 12.70 లక్షల మంది దివ్యాంగులు ఉండగా.. ప్రస్తుతం 2 లక్షల మంది మాత్రమే పాస్‌లు కలిగి ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో సుమారు 42 వేల మంది దివ్యాంగులు ఉన్నారు. వారందరికీ పాస్‌లు అందేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం బస్ స్టేషన్లలో ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించి, వంద శాంతం మందికి పాస్‌లు అందజేసేలా ప్రక్రియను సరళీకరణ చేస్తాం' అని అన్నారు

## పుట్టా మహేశ్ వ్యవహారంపై చంద్రబాబు సీరియస్



**అమరావతి, పతాకం న్యూస్:** మొయినాబాద్ డ్రగ్స్ కేసు వ్యవహారం తెలుగుదేశం పార్టీలో పెను తుపాను సృష్టిస్తోంది. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ పేరు ఈ కేసులో ప్రముఖంగా వినిపించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. క్రమశిక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో చంద్రబాబు ఈ అంశంపై స్పందిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యువతను రాజకీయాల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పుట్టా మహేశ్ కు ఎంపీ టికెట్ ఇస్తే, ఆయన ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి డ్రగ్స్ పార్టీలకు వెళ్లడం క్షమించరాని తప్పని, ఇలాంటి వారి ప్రవర్తన వల్ల పార్టీ సమాధానం చెప్పుకోవాల్సి రావడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దురలవాట్లతో పార్టీ పరువు తీసే వారిని మోయాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి లేదని చంద్రబాబు కుండబద్దలు కొట్టారు. టీటీడీ మాజీ చైర్మన్, ప్రస్తుత మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడైన మహేశ్... మంచి రాజకీయ నేపథ్యం ఉండి కూడా ఇలా ప్రవర్తించడం సరికాదని చంద్రబాబు హితవు పలికారు. ఇప్పటికే పార్టీ నుండి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, ఐదు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించామని గుర్తు చేశారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకులంతా ప్రజల్లో విశ్వసనీయతను కాపాడుకోవాలని, వ్యక్తిగత ప్రవర్తన విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు.

## నితిన్ గడ్కరిని కలిసిన రాహుల్, ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా బుధవారంనాడు పార్లమెంటు హౌస్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలుసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన బస్ అండ్ ట్రక్ బాడీ బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. బస్ అండ్ ట్రక్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీనికి ముందు, స్మాల్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రతినిధి బృందం సభ్యులు రాహుల్ గాంధీ కలుసుకున్నారు. సవరించిన నిబంధనల వల్ల ధరలు, లైసెన్సులు పొందడంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. నూతన రెగ్యులేటరీ ప్రమాణాలు, హెచ్చు ఫీజుల వల్ల తాము వ్యాపారాలను మానుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని, ఇందువల్ల తామ జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని వివరించారు.గడ్కరితో సమావేశానంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ, లైసెన్స్ ప్రక్రియ ఖరీదైన వ్యవహారంగా మారడం, కాలహరణం జరుగుతుండటం వంటివి చోటుచేసుకుంటున్నాయని, ఈ విషయాన్ని గడ్కరి దృష్టికి తెచ్చామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని గడ్కరి హామీ ఇచ్చినట్టు తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)

## ప్రారంభించిన చంద్రబాబు

సీఎం కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి చంద్రబాబు, మంత్రి లోకేశ్ భోజనం చేశారు. కేవలం 21 నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇవాళ ప్రారంభించిన ఈ దివ్యాంగ శక్తి పథకం నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోందని అన్నారు. తాను, పవన్ కల్యాణ్, లోకేశ్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి ప్రయాణించటం తనకు సంతృప్తిని ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వాళ్లని సీఎం చంద్రబాబు కొనియడారు. గతంలో చేయూత కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సహాయం చేశామని వివరించారు. ట్రైసైకిళ్లతో పాటు తమ ఆత్మవిశ్వాసం నింపడానికి టూ వీలర్లు అందించామని చంద్రబాబు తెలిపారు. దివ్యాంగులకు పింఛను కింద రూ. 6,000 ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని తేల్చి చెప్పారు. గతంలో రూ. 500 ఉండే దివ్యాంగుల పెన్షన్‌ను ప్రస్తుతం రూ. 6,000 పెంచి ఇస్తున్నామని గుర్తు చేశారు. తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే వారికి రూ. 10,000, మంచానికి పరిమితమైన వారికి రూ. 15,000 ఇస్తున్నామని సీఎం వివరించారు. ఇప్పుడు బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఎలాంటి ఖర్చు లేకుండా 5 రకాల బస్సుల్లో దివ్యాంగులు ఇక ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని సీఎం వివరించారు. దీని ద్వారా నెలకు రూ. 2,000 వరకు అందరికీ ఆదా అయ్యే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. దివ్యాంగ శక్తి పథకంతో ఈ ఉగాది మరింత బాగా జరుపుకోవాలని సీఎం సూచించారు. అంతేకాకుండా అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగ శక్తి ద్వారా 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా ఎంత ఖర్చు చేస్తున్నామన్నది ముఖ్యం కాదని, దివ్యాంగులకు గౌరవాన్ని పెంచేందుకు ఈ పథకం అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. కూటమి అమలు చేసే ఏ పథకం, ఏ కార్యక్రమమైనా నిరుపేదల సంక్షేమం కోసమేనని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఎక్కువ సమస్యలు ఎదుర్కొనే దివ్యాంగులకు అండగా నిలబడాలనే కూటమి పనిచేస్తోందని సీఎం వెల్లడించారు. మహిళల కోసం స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ రూ. 52 కోట్ల ప్రయాణాలు జరిగాయని తెలిపారు. దివ్యాంగ సమస్యలపై ఎప్పుడూ పోరాటాలు చేసే మంద కృష్ణమాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరావులను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అభినందించారు. స్త్రీశక్తి బస్సుల్లో దివ్యాంగులు ప్రయాణించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఇప్పటికే స్త్రీ శక్తి ద్వారా రూ. 52 కోట్లకు పైగా మహిళలు ఉచిత ప్రయాణాలు చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగ శక్తి కార్యక్రమాన్ని పలువురు ఎమ్మెల్యేలు పలు ప్రాంతాల్లో ప్రారంభించారు. ఆర్టీసీ బస్సులో దివ్యాంగులతో కలిసి ఎమ్మెల్యేలు ప్రయాణం చేశారు.

# తరచూ మొరాయిస్తున్న అంబులెన్స్.. రోగులకు ఇక్కట్లు..



**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని మారుమూల పినకోట పీహెచ్‌సీ అంబులెన్స్ తరచూ మొరాయిస్తుండడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించే క్రమంలో అంబులెన్స్ ఎక్కడ ఆగిపోతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. సుమారు ఏళ్ల క్రితం పినకోట పీహెచ్‌సీకి పాత అంబులెన్స్‌ను కేటాయించారు. సరైన నిర్వహణ లేక ఇది తరచూ మొరాయిస్తోంది. దీంతో రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు జీపులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందాల్సి వస్తోంది. కివర్ల, పెదకోట, పినకోట, జీనబాడు సచివాలయాల పరిధిలోని 72 గ్రామాల గిరిజనులు పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపైనే ఆధారపడతారు. కాగా నాలుగు రోజుల క్రితం కివర్ల పంచాయతీ పుతికపుట్టు గంగవరం గ్రామం నుంచి ఓ గర్భిణిని పినకోట అంబులెన్స్‌లో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో గల దేవరాపల్లి మండల కేంద్రానికి వచ్చేసరికి ఆగిపోయింది. దీంతో 108 వాహనంలో గర్భిణిని తరలించారు. సోమవారం దాయర్తి గ్రామానికి చెందిన వంతల మాలతి అనే గిరిజనుడికి వడదెబ్బ తగిలి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు పినకోట అంబులెన్స్ కోసం ఫోన్ చేయగా మరమ్మతులకు గురైందని తెలిసింది. తరచూ ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామని రోగులు వాపోతున్నారు.

ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి స్పందించి పినకోట పీహెచ్‌సీకి కొత్త అంబులెన్స్ కేటాయించాలని 72 గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

# 11 నెలల్లో రూ.750 కోట్లతో నగరాభివృద్ధి




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీ మేయర్‌గా పనిచేసిన ఈ 11 నెలల కాలాన్ని తన జీవితంలో మరిచిపోలేనని మాజీ మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. మేయర్‌గా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హయాంలో జీవీఎంసీ పరిధిలో సుమారు రూ.750 కోట్లతో అభివృద్ధిపనులు చేపట్టామన్నారు. గుడ్‌మార్నింగ్ పేరుతో వార్డులో క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడం తనకు సంతృప్తినిచ్చిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చానని, పార్టీలకు అతీతంగా కార్పొరేటర్లకు నిధుల కేటాయింపులో సమన్యాయం పాటించానన్నారు. తన హయాంలో నగరం వేదికగా జరిగిన ఐఎఫ్ఆర్ వంటి కార్యక్రమాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపువచ్చేలా ఏర్పాట్లుచేశామన్నారు. బీచ్‌రోడ్డులో రాత్రిపారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, అవకతవకలను సరిదిద్దానన్నారు. రాత్రివేళ బీచ్‌ను సందర్శించే పర్యాటకులకు ఎగసిపడుతున్న అలలు కనిపించేలా అధిక కాంతినిచ్చే హైమాస్ట్ లైట్లను తీరంలో ఏర్పాటుచేశామన్నారు. నగరవాసులతోపాటు కార్పొరేటర్లు, జీవీఎంసీ అధికారుల సహకారంతో దిగ్విజయంగా పాలన సాగించానని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ వల్లనే తనకు మేయర్‌గా పనిచేసే అవకాశం దక్కిందని, పాలకవర్గం పదవీకాలం ముగిసినందున ఇకపై పూర్తిగా పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమవుతానన్నారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా పార్టీకి సేవ చేస్తానన్నారు. జీవీఎంసీలోని కొన్నివిభాగాల పనితీరు బాగోలేదని, వాటిని సరిదిద్దేందుకు భవిష్యత్తులోనూ తన వంతు ప్రయత్నిస్తానన్నారు.

# బొగ్గు హ్యాండ్లింగ్ యార్డుతో కాలుష్యం



**కశింకోట, పతాకం న్యూస్:** : మండలంలోని బయ్యవరం రైల్వే స్టేషన్ సమీపంలో వున్న బొగ్గు దిగుమతి/ ఎగుమతి యార్డును దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా పరిశీలించారు. ఈ సందర్భంగా బొగ్గు లోడింగ్, అన్‌లోగింగ్, రవాణా జరిగేటప్పుడు వెలువడే నల్లటి బూడిద కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆయనకు చెప్పారు. గత నెల 13న తాము అధికారులకు ఫిర్యాదు చేయగా, క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా సమస్యను పరిష్కరించినట్టు నివేదిక ఇచ్చారని ఆరోపించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రామన్నపాలెం, బయ్యవరం, జమాదులపాలెం గ్రామాల్లో కాలుష్య కొలమాన యంత్రాలను ఏర్పాటు చేశారని, సాధారణంగా ఏయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 100 లోపు వుండాలని, కానీ ఇక్కడ ఏకంగా 400 నమోదైనట్టు నివేదిక ఇచ్చారని తెలిపారు. దీనిపై సంబంధిత కోల్ హ్యాండ్లింగ్ నిర్వాహకులకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు కూడా జారీ చేశారని పేర్కొన్నారు. గ్రామాల్లో పీఎం సూర్యఘర్ పథకం కింద పలువురు ఇళ్లపై సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకున్నారని, అయితే బొగ్గు కారణంగా వెలువడుతున్న దుమ్ము, ధూళి వల్ల విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదన్నారు. సూక్ష్మ బొగ్గు కణాలు కలిసిన గాలిని పీల్చడం వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నామని వాపోయారు. నల్లటి పొడి వంటి పదార్థం ఇళ్ల లోపలికి కూడా వస్తున్నదని చెప్పారు. బయ్యవరంలో బొగ్గు లోడింగ్, ఆన్‌లోడింగ్, రవాణా కార్యకలాపాలను నిలిపివేయాలని వారు కోరారు. మీరు ఇచ్చిన ఫిర్యాదును రైల్వే ఉన్నతాధికారులకు పంపించి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని డీఆర్ఎం హామీ ఇచ్చారు.

# పిన్నెల్లికి బెయిల్ మంజూరు.. ఆయన సోదరుడికి షాక్

**గురజాల, పతాకం న్యూస్:** వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి గురజాల కోర్టు భారీ ఊరటను కల్పించింది. ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. టీడీపీ నాయకుల జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న ఆయన... గత 98 రోజులుగా నెల్లూరు జైలులో రిమాండ్ లో ఉన్నారు. సుదీర్ఘ కాలం తర్వాత ఆయనకు విముక్తి లభించడంతో పల్నాడు జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అయితే, ఇదే కేసులో పిన్నెల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డికి మాత్రం కోర్టు షాక్ ఇచ్చింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం నిరాకరించింది. ఒకరికి బెయిల్ లభించి, మరొకరికి నిరాకరణ ఎదురవ్వడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది. త్వరలోనే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలు నుండి విడుదల కానున్నారు.

# దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేసిన ఎమ్మెల్యే గణబాబు






**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గాజువాక డిపో ప్రాంతానికి సంబంధించినటువంటి ఏరియాలో ఉన్నటువంటి దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం గల పథకాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించజఱ/. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫోటెక్సర్ డెవలప్మెంట్ ఆశీగ దుర్గ ప్రశాంతి, మరియు వెలము కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్ నాయుడు,మజ్జి సోమేశ్ కలిసి ఈ మహత్తర కార్యక్రమాన్ని గాజువాక డిపో నుంచి మల్కాపురం వరకు దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేసి వాళ్లకి గుర్తింపు కార్డులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబుకు దివ్యాంగులు తరపున తల్లిదండ్రులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# విశాఖలో ఘనంగా ప్రారంభమైన “దివ్యాంగ శక్తి పథకం’ను ప్రారంభించిన పీవీయన్ మాధవ్

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందించే “దివ్యాంగ శక్తి పథకం”ను అమలు చేస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ అన్నారు . ఈ రోజు విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించాలనే దృక్పథంతో ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని పేర్కొన్నారు. దివ్యాంగులు రోజువారీ జీవితంలో ఎదుర్కొనే రవాణా సమస్యలను తగ్గించడంలో ఈ ఉచిత బస్సు సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులకు స్వేచ్ఛాయుత ప్రయాణం కల్పించడమే కాకుండా, వారి సామాజిక, ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ఇది ఒక ముందడుగుగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్య దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# లాకప్‌లో నన్ను శారీరకంగా, మానసికంగా హింసకు గురి చేశారు: అంబటి రాంబాబు



**గుంటూరు, పతాకం న్యూస్:** సత్తెనపల్లి, నల్లపాడు, పట్టాభిపురం పోలీస్ స్టేషన్లలో తనపై నమోదైన అక్రమ కేసుల విషయంలో పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి ఆవేదన వ్యక్తం చేశారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లతో తనను 18 రోజుల పాటు సెంట్రల్ జైల్లో ఉంచేలా పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారని మండిపడ్డారు. ఇది సుప్రీంకోర్టు గత తీర్పులకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేశ్ చెబితేనే తనను కోర్టులో ప్రవేశ పెట్టారని మండిపడ్డారు. తనను లాకప్‌లో ఉంచిన సమయంలో పోలీసులు శారీరక, మానసిక హింసకు గురిచేశారని, దీనిపై న్యాయపోరాటం చేస్తానని అంబటి అన్నారు. తన నివాసం, వాహనాల మీద ఏడు గంటల పాటు దాడి జరుగుతుంటే పోలీసులు అడ్డుకోకుండా ప్రేక్షక పాత్ర వహించారని, కానీ దాడి చేసిన వారికి మాత్రం వెంటనే స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారని ధ్వజమెత్తారు.

# ‘ఒక్కరు వద్దు –ముగ్గురు ముద్దు’తో భారం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ‘ఒక్కరు వద్దు –ముగ్గురు ముద్దు’ అని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనతో ప్రజలపై భారం పెరుగుతుందని మహిళా సంఘాల ఐక్యవేదిక పేర్కొంది. ఈ మేరకు పౌర గ్రంథాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐద్వా, పిఒడబ్ల్యూ, సిఎంఎస్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు మహిళా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు ఎ.విమల, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వనజాక్షి, బేగం, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి, పిఒడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.లక్ష్మిబాలనాగమ్మ, సిఎంఎస్ మహిళా సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్.లలిత తదితరులు మాట్లాడుతూ ‘ఒక్కరు వద్దు ముగ్గురు ముద్దు’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల శాసనసభ సమావేశాలలో ప్రకటించిన జనాభా నిర్వహణ విధానం వాస్తవంగా పెద్ద ఆర్థిక సామాజిక బాంబు అని పేర్కొన్నారు. లాభం కంటే నష్టాలే అధికమని తెలిపారు. కష్టాలు నష్టాలను నిర్లక్ష్యం చేస్తే జపాన్, దక్షిణ కొరియా, ఇటలీలా ఆంధ్రప్రదేశ్ జనాభా భారీ విపత్తులో కూరుకుపోతుందన్నారు. రాష్ట్రానికి అపారమైన ఆర్థిక భారంగా మారుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ మీద పెద్ద దెబ్బ పడుతుందన్నారు. ప్రతి రెండో/ మూడో బిడ్డకు రూ.25 వేలు, 5 ఏళ్లు నెలకు రూ.1,000, 18 ఏళ్ల ఉచిత విద్య, సబ్సిడీ మాతృత్వ సెంటర్లు, చైల్డ్ కేర్ హాస్టళ్లు, అదనపు సెలవులు.. ఇదంతా ఏటా వేల కోట్ల ఖర్చు అని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ఆర్థికంగా వెంటిలేటర్‌పై ఉందని చెప్పిన చంద్రబాబు మరి దీనిని ఎలా అధిగమిస్తారని ప్రశ్నించారు. ఇంకా పన్నులు పెంచుతారా, రుణాలు, మరింత అప్పులు తెస్తారా, లేదా ఇస్తున్న సంక్షేమ పథకాలను కత్తిరిస్తారా అన్ని ప్రశ్నించారు. పిల్లలను కనడం కోసం కేవలం నగదు ప్రోత్సాహకాలు ఇచ్చి మూల సమస్యలు పరిష్కరించకపోతే ఉపయోగముండదని, డబ్బు ఇచ్చి ప్రవర్తన మార్చడం సాధ్యంకాదని పేర్కొన్నారు.

# తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



**పాడేరు, పతాకం న్యూస్:** వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. అల్లూరి, పోలవరం జిల్లాలకు చెందిన అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేసి ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేసే ప్రక్రియను చేపట్టాలన్నారు. అలాగే అంగన్‌వాడీ, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు స్థానికంగానే ముడిసరుకులను సమకూర్చుకోవాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఇంకుడు గుంతల నిర్మాణం, పలు గ్రామాల్లో మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో నిరుద్యోగులకు అవసరమైన వృత్తి నైపుణ్య శిక్షణలు అందించాలని, విశ్వకర్మ యోజనలో రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి మండలంలోనూ సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పీ4లో భాగంగా బంగారు కుటుంబాల దత్తతకు మార్గదర్శులను ఎంపిక చేయాలని, వారి విజయగాథలను గుర్తించి, వాటిపై ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించే పోటీల్లో రాష్ట్రస్థాయిలో విజయం సాధించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పాడేరు, అరకులోయ మండలాల్లో ఎక్కువ మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రణాళిక రూపొందించాలని, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో భారీగా జాబ్‌మేళాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు, జడ్పీ సీఈవో నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీ నాగేశ్వరరావు, స్వర్ణగ్రామ జిల్లా నోడల్ అధికారి పీఎస్ కుమార్, జిల్లా పరిశ్రమ శాఖాధికారి ఆర్‌వీ రమణారావు, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ జీఎన్ ప్రసాద్, మైనింగ్ ఏడీ ఆనంద్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ జి.డేవిడ్‌రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎంపీ పుట్టా మహేశ్ అంశంపై స్పందించిన రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో ఎంపీ పుట్టా మహేశ్‌కి స్టేషన్ బెయిల్ వ్యవహారంలో తమ ప్రమేయం లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ డ్రగ్స్ కేసు త్వరితగతిన విచారించడానికే ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం సీఎం రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. 2028లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగవన్నారు. 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని ఆయన జోస్యం చెప్పారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు ముందే వస్తే తనకూ సంతోషమేనని పేర్కొన్నారు. అంతకముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజ్యసభకు ఇటీవల ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని వారికి పరిచయం చేశారు. ఈ పర్యటనలో రేవంత్‌తో పాటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఉన్నారు. పార్లమెంట్‌లో వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా సీఎం రేవంత్ రెడ్డి, ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారిరువురు ఒకరినొకరు పలకరించుకున్నారు.

## మూతపడుతున్న హోటళ్లు




**విజయనగరం, పతాకం న్యూస్:** పశ్చిమాసియా దేశమైన ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దేశాలు దురాక్రమణ యుద్ధం సాగిస్తున్న నేపథ్యంలో ఆ ప్రభావం దేశం, రాష్ట్రంపైనే కాదు విజయనగరం జిల్లాపైనా పడింది. ప్రధానంగా యుద్ధం ప్రభావంతో జిల్లాలో గ్యాస్ కొరత నెలకొంది. ఫలితంగా హోటల్ రంగం తీవ్రంగా నష్టపోతోంది. ఇప్పటికే జిల్లాలోని వందలాది టిఫిన్ దుకానాలు, టీ స్టాల్స్ మూతపడ్డాయి. యుద్ధం మరికొన్ని రోజులు కొనసాగితే దాని ప్రభావం మరిన్ని రంగాలపై పడి ప్రజలు నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధ ప్రభావం జిల్లాలోని హోటల్ రంగంపై తీవ్రంగా పడింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిపివేయడంతో జిల్లా వ్యాప్తంగా చిన్న చిన్న హోటళ్లు, టీ స్టాల్స్ మూతపడ్డాయి. దీంతో సుమారు పదివేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. చిరు వ్యాపారాలు చేసుకునే వారి జీవనం అతలాకుతలం అవుతోంది. మరోవైపు యుద్ధ పరిస్థితులను ఆసరా చేసుకున్న కొన్ని గ్యాస్ ఏజెన్సీలలు కృత్రిమ కొరత సృష్టించి కమర్షియల్, డొమెస్టిక్ సిలిండర్లనే తేడా లేకుండా అందిన కాడికి దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి కమర్షియల్ గ్యాస్ నిలుపుదల చేయడంతో వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. కమర్షియల్ గ్యాస్ కొన్ని ఏజెన్సీల దగ్గర ఉన్న నిల్వలను ఇప్పటికే చిరు వ్యాపారులకు అందించారు. వారి వద్ద కూడా స్టాక్ లేకపోవడంతో ఆ ప్రభావం హోటల్స్‌పై పడింది. ఈనేపథ్యంలోనే విజయనగరంలో చిరు వ్యాపారాలు సాగించే హోటల్స్, పకోడి, బజ్జీ దుకాణాలు, టిఫిన్ దుకాణాలు, తందూరి పాయింట్లు నాలుగు రోజులుగా ఒక్కొక్కటీ మూతపడడంతో చిరు వ్యాపారులంతా ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలాగే యుద్ధం మరికొన్ని రోజులు కొనసాగితే పెద్ద హోటల్స్ కూడా మూతపడి వేలాది మంది రోడ్డున పడే ప్రమాదం ఉంది.

## ఉగాది నుంచి వజ్రోత్సవాలు




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకు ళం నగరంలోని ఆర్ష, సాహిత్య, ఆధ్యాత్మిక సేవా సంస్థ ఉపనిషన్మందిరం ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 19వ తేదీ (గురువారం) నుంచి వచ్చే ఏడాది ఉగాది వరకు వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడు తూ.. ఏడాది పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా 19న ఉగాది రోజున శ్రీకోదండ రామాలయంలో ప్రముఖ జ్యోతిష పండితుడు తెన్నేటి విక్రమ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నామ న్నారు. 20 నుంచి 26వ తేదీ వరకు ప్రముఖ పండితులు రామాయణంలోని వివిధ ఘట్టాల పై ప్రసంగిస్తారన్నారు. ప్రతీరోజు సాయంత్రం 6 గంటల నుంచి శ్రీమద్రామాయణ ప్రసం గాలు నిర్వహిస్తున్నామని, ఆధ్యాత్మిక ప్రియు లు, సాహితీవేత్తలు పాల్గొని విజ యవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు వి.కామేశ్వరరావు, పి.పతంజలి శాస్త్రి, నిష్టల నరసింహమూర్తి, డీజీ పట్నా యక్, తెన్నేటి విక్రమశర్మ, డా.మందుల మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో కలపొద్దు




**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడ రైల్వే డిపో (సికింద్రాబాద్ డివిజన్)ను యథావిధిగా కొనసాగించాలని, ఏప్రిల్ ఒకటి నుండి ప్రారంభమయ్యే దక్షిణ కోస్తా రైల్వే డివిజన్లో కలపొద్దని డిమాండ్ చేస్తూ విజయవాడలో రైల్వే ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన రైల్వే లోకో పైలెట్లు, ట్రైన్ మేనేజర్ (గార్డులు) జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) కన్వీనర్ జి.విజయకుమార్ ఆధ్వర్యంలో విజయవాడలోని డిఆర్ఎం కార్యాలయం కుటుంబ సభ్యులతో కలిసి సుమారు 150 మంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ (డిఆర్ఎం) కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విజయవాడ కేంద్రంగా కాజీపేట, సికింద్రాబాద్, లింగంపల్లి, బలార్షా రూట్ రన్నింగ్ స్టాఫ్‌గా విధులు నిర్వహిస్తున్న తమను త్వరలో విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభమవుతున్న సౌత్ కోస్టల్ డివిజన్లో కలపొద్దని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ జి.విజరు కుమార్ మాట్లాడుతూ 17 ఏళ్ల క్రితం సికింద్రాబాద్ డివిజన్ డిపోను విజయవాడలో ఏర్పాటు చేశారన్నారు. అయితే రాష్ట్ర విభజన కారణంగా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పడుతోందని పేర్కొన్నారు. కొండపల్లి వరకు ఉన్న సికింద్రాబాద్ రైల్వే డివిజన్ మోటమర్రి వరకు కుదించారని, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ పరిధి విజయవాడ నుండి 47 కిలోమీటర్లు పెరుగుతుందని తెలిపారు. అయితే సుమారు 300 కుటుంబాల వారు విజయవాడలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారని, విధి నిర్వహణలో భాగంగా నిత్యం 490 కిలోమీటర్లు మేర సికింద్రాబాద్, లింగంపల్లి, ఇటు బలార్ష వరకు వెళ్తున్నారని వెల్లడించారు.

# రాష్ట్రాలకు కేంద్రం 10 శాతం అదనపు కమర్షియల్ ఎల్పీజీ




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా దేశంలో తలెత్తిన ఎల్పీజీ ) కొరతను అధిగమించేందుకు కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా మరో 10 శాతం కమర్షియల్ ఎల్‌పీజీ అందించేందుకు అంగీకరించింది. అయితే ఎల్‌పీజీ భారాన్ని తగ్గించి పైప్డ్ నేచురల్ గ్యాస్ ) వాడకాన్ని పెంచే రాష్ట్రాలకు మాత్రమే ఈ అదనపు సరఫరా వర్తిస్తుందని తెలిపింది. ఆ ప్రకారం ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేలా రాష్ట్రాలు ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం చేయాల్సి ఉంటుంది. దేశీయ వంటగ్యాస్ సరఫరాకు ఆటకం కలగకుండా చూడటం, వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ కొరత తీర్చడం ప్రభుత్వ ముఖ్యోద్దేశమని పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. సీజీడీ అప్లికేషన్ల అప్రూవల్, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లయితే 1 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని, డీమ్డ్ సీజీడీ పర్మిషన్లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేస్తే 2 శాతం, రోడ్ల తవ్వకం, మరమ్మతు (డిగ్ అండ్ రిస్టోర్) పథకం ప్రవేశపెడితే 3 శాతం, వార్షిక రెంటల్/లీజ్ తగ్గిస్తే 4 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని ఆమె చెప్పారు. ఎల్‌పీజీ అంశం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ పరిస్థితి మెరుగుపడిందని సుజాత శర్మ తెలిపారు. ఈనెల 17న 2,300కు పైగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. చాలా రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాగా, ఎల్పీజీ సరఫరాలపై ఒత్తిడిని తగ్గించేందుకు హాస్పిటాలిటీ, రెస్టారెంట్లతో సహా పలు రంగాలకు కిరోసిన్, బొగ్గు సరఫరాలకు కేంద్రం ఇప్పటికే ఆదేశాలిచ్చింది.

## దివ్యాంగులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం




**ఎస్.కోట, పతాకం న్యూస్:** అర్హత కలిగిన దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా దివ్యాంగ శక్తి పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనే జర్ కె.సుదర్శనరావు ఓ ప్రకట నలో తెలిపారు. 40 శాతం, ఆపైన దివ్యాంగత కలిగిన వారికి ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం చేసేందుకు బుధవారం నుంచి బస్ పాస్‌లను మంజూరు చేస్తామన్నారు.

## సాగునీరందేందుకు చర్యలు తీసుకోండి



**ఆమదాలవలస, పతాకం న్యూస్:** అన్ని గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పొలాల కు సాగునీరందించేలా చర్యలు తీసుకో వాలని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. పట్టణం లోని తన క్యాంప్ కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన నీటి పారుదలశాఖాధి కారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన నీటిపారుదల ప్రాజెక్టుల పురో గతి, కాలువల మరమ్మతులు, పూడికతీత వాటి నిర్వ హణ, చెరువులు పునరుద్ధరణ తదితర అంశా లపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సాగుకు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో నీరందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో నారాయణపురం ప్రాజెక్టు చైర్మన్ సనపల ఢిల్లీశ్వర రావు, ఇరిగేషన్ ఎస్ఈ పి.సుధాకర్, వంశధార ఈఈ రవీంద్రబాబు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## కాళ్లు పట్టుకుంటాం...
## డంపింగ్‌యార్డును తరలించరూ?



**గాజువాక, పతాకం న్యూస్:** 'మీ కాళ్లు పట్టుకుంటాం.. ఈ డంపింగ్ యార్డును తరలించరూ' అంటూ రామచంద్రనగర్ ప్రాంత మహిళలు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను వేడుకున్నారు. జివిఎంసి 76వ వార్డు పరిధిలోని రామచంద్రనగర్ డంపింగ్ యార్డు పరిశీలనకు మంత్రి నారాయణ వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రామచంద్రనగర్, రిక్షాకాలనీ, స్వతంత్ నగర్‌కు చెందిన మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వెంటనే ఈ డంపింగ్ యార్డును తరలించాలని మంత్రి వద్ద ప్రాధేయపడ్డారు. దుర్వాసన భరించలేకపోతున్నామని, అనేక రోగాల బారిన పడుతున్నామని మహిళలందరూ ముక్తకంఠంతో ఆయనకు సమస్యను తెలియజేశారు. తక్షణమే తరలించే ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. వారి మాటలకు మంత్రి స్పందించకుండా తరలించడం కుదరదని, ప్రత్యామ్నాయం పరిశీలిస్తామని చెప్పారు. దీనిపై మహిళలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ 'డంపింగ్‌యార్డును తరలించాల్సిందే' అంటూ పెద్ద ఎత్తున నినదించారు. దీంతో వివాదం పెద్దది కాకుండా పక్కన ఉన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. 16 గ్రామాల స్థానిక ప్రజలు, తరుపున డంపింగ్ యార్డు పోరాట కమిటీ నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ వినతి పత్రం కూడా అందజేశారు. వినతిని చూడకుండానే డంపింగ్ యార్డును తరలించడం కుదరదని, ఎప్పటి చెత్త అప్పుడు తరలిస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని చెప్పి వెళ్లిపోయారు.

## గ్యాస్ కోసం బారులు



**విజయనగరం, పతాకం న్యూస్:** విజయనగరంలోని సుంకరపేట వద్దగల హెచ్‌పి గ్యాస్ గొడౌన్ వద్ద ప్రజలు గ్యాస్ సిలిండర్ల కోసం బారులు తీరారు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ యుద్ధంతో గ్యాస్‌కు కొరత ఏర్పడింది. దీంతో, గ్యాస్ సకాలంలో అందుతుందో? లేదో? అని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఆన్‌లైన్లో గ్యాస్ బుక్ చేసుకుంటే డెలివరీ బాబ్ ఇంటికి తీసుకొచ్చి ఇచ్చేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో వినియోగదారులే నేరుగా గ్యాస్ ఏజెన్సీకే వెళ్లి క్యూలో గంటల కొద్దీనిల్చొని గ్యాస్‌ను విడిపించుకుంటున్నారు.

## వంతెన నిర్మాణంపై నిర్లక్ష్యం వీడాలి



**మన్యం జిల్లా, పతాకం న్యూస్:** మన్యం జిల్లాలోనే దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు లాభేసు వంతెన నిర్మాణాలపై గత ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వేడాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బరావమన్నారు. బుధవారం బాధిత గ్రామస్తులతో కలిసి సిపిఎం బృందం సభ్యులు వంతెన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పటి సిపిఎం ఎమ్మెల్యే కోలక లక్షణమూర్తి అసెంబ్లీలో ఈ వంతెన సమస్యపై ప్రస్తావించగా అప్పట్లో మంజూరు చేసినప్పటికీ 20 ఏళ్లు కావస్తున్నా నిర్మాణానికి నోచుకోకపోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వాల అధికారం మారుతున్న స్థానిక ఎమ్మెల్యేలకు ఈ వంతెన ఒక ఎన్నికల హామీగా ఓట్లు కోసం పూర్తి చేస్తామని చెప్పుకునేందుకు మాత్రమే పొందు తప్ప నిర్మాణానికి మాత్రం నోచుకోవడం లేదన్నారు. ప్రతి ఎన్నికల ముందు ఎమ్మెల్యే అభ్యర్థులు ఈ వంతెన మా పార్టీ అధికారంలోకి వస్తే పూర్తి చేసుకుంటామని చెప్పుకోవడానికి తప్ప నిర్మాణం మాత్రం ముందుకు సాగడం లేదన్నారు. కేవలం ఈ వంతెన నిర్మాణం మూడు పిల్లర్లు నిర్మాణం ఇచ్చేందుకే ప్రభుత్వాలు ఇంత నిర్లక్ష్యం వహించడం చాలా దారుణం అన్నారు. ప్రభుత్వం మార్చి నెలాఖరు నాటికి మిగిలి ఉన్న డబ్బులను ఖర్చు చేసేందుకు ప్రతి గ్రామానికి రూ.10 కోట్లు వరకు రహదారుల కోసం కేటాయించడం సాధ్యమైనా వారికి కేవలం ఒక ఐదు కోట్లు, మూడు పిల్లర్ల కోసం ఈ వంతెనకు నిధులు కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానికంగా ఉన్న నాయకులు ప్రజలు ఇబ్బందులపై కనీసం పరిష్కరించేందుకు చొరవచోపడం నిర్మాణం పూర్తి చేయకపోవడం చాలా దారుణం అన్నారు. ఏప్రిల్ 10వ తేదీ నాటికి ఈ వంతెన పనులు ప్రారంభం కాకపోతే బాధిత గ్రామస్తులతో కలిసి సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, కార్యవర్గ నాయుడు జిల్లా కమిటీ సభ్యులు ఇందిరా సాంబమూర్తి, పూర్ణపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.30వేలు నిర్ణయించాలి

**గుంటూరు, పతాకం న్యూస్:** స్థానిక అరండల్‌పేటలోని ఓ హోటల్లో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల జోనల్ కనీస వేతన బోర్డు సమావేశాన్ని కార్మిక సంఘాలు బారుకాట్ చేశాయి. వేతన పెంపుదలకు సంబంధించి నిర్దిష్టతలు లేకపోవటంతో, మినిమం వేజ్ అడ్వైజరీ బోర్డు (కనీస వేతన సలహా మండలి)లో కార్మిక సంఘాలకు స్థానం లేకుండా టిడిపి కార్యక ర్తలతో నింపటాన్ని నిరసిస్తూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, ఎఐటి యుసి గౌరవాధ్యక్షులు వి.రాధాకృ ష్ణమూర్తి, ఐఎన్‌టియుసి నాయకులు విసా క్రాంతికుమార్, ఐఎఫ్‌టియు కోటయ్య, ఎపిఎఫ్‌టియు నాయకులు మేకల రవికుమార్, ఐఎఫ్‌టియు నాయకులు కృష్ణ సమావేశాన్ని బారుకాట్ చేశారు. తొలుత సమావేశంలో మినిమం వేజ్ అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ షెడ్యూల్ పరిశ్రమల్లో వేతనాలు పెంచడానికి సూచనలు, సలహాల కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 65 రకాల షెడ్యూల్ పరిశ్రమలు ఉన్నాయని 2012 నుండి షెడ్యూల్డ్ పరిశ్రమల్లో వేతనాలు పెరగలేదని చెప్పారు. ప్రతి ఐదేళ్లకోసారి వేతనాలు పెంచాల్సి ఉందన్నారు.

## శ్రీవారి సేవలో ధర్మవరం పట్టు.. చేనేతలకు టీటీడీ భారీ ఆర్డర్




**ధర్మవరం, పతాకం న్యూస్:** శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం చేనేత కార్మికులకు మంచి రోజులొచ్చాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల శ్రీవారి సేవలో ఇకపై ధర్మవరం పట్టు వస్త్రాలు భాగం కానున్నాయి. శ్రీవారి ఆర్జిత సేవల్లో పాల్గొనే వారికి అందించే పట్టు శాలువాలను ఇకపై ధర్మవరం నుంచే కొనుగోలు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు తొలి విడతగా 65 వేల పట్టు శాలువాల కొనుగోలుకు టీటీడీ అనుమతులు మంజూరు చేసిందని మంత్రి సవిత వెల్లడించారు. ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి ఈ శుభవార్తను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మరో మంత్రి సత్యకుమార్, చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, టీడీపీ ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ శాలువాల సరఫరా కోసం ధర్మవరంలో ప్రత్యేకంగా ఆప్కో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత తెలిపారు. దీని ద్వారా నేరుగా చేనేతల నుంచి వస్త్రాలను కొనుగోలు చేసి టీటీడీకి అందిస్తామని వివరించారు. ఈ సందర్భంగా ధర్మవరం చేనేత కార్మికులు తయారు చేసిన నమూనా పట్టు శాలువాను మంత్రులు సవిత, సత్యకుమార్ ఆవిష్కరించారు. టీటీడీ నిర్ణయంతో ధర్మవరం ప్రాంతంలోని వేలాది చేనేత కుటుంబాలకు ఉపాధి లభించనుండటంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో రూ.1,650 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో రూ.1,650 కోట్ల విలువైన 11 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. ఇందులో 2 ఎకరాలు పార్కు కోసం, 5 ఎకరాలు శ్మశాన వాటిక కోసం, 4 ఎకరాల డంప్ యార్డుకు చెందినదిగా ఉంది. రంగరెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ విలేజ్‌లోని సెంట్రల్ పార్కు కాలనీలో పార్కు కోసం 2 ఎకరాలు కేటాయించారు. సర్వే నంబరు 110/1 లో 148 ప్లాట్లతో 16 ఎకరాల మేర సెంట్రల్ పార్కు కాలనీ ఫేజ్-1 పేరుతో 1998లో లే ఔట్ వేశారు. ఇందులో 2 ఎకరాలను పార్కు కోసం కేటాయించగా, మున్సిపల్ అధికారులు పార్కు స్థలంగా హద్దులు నిర్ధారించి ప్రహరీ కూడా నిర్మించారు. పార్కు కోసం కేటాయించిన భూమి తమదంటూ కొంతమంది ఆక్రమించే ప్రయత్నం చేశారు. హైడ్రా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. 2 ఎకరాల పార్కు స్థలంగా నిర్ధారించింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఉదయం పార్కులో తాత్కలికంగా వేసిన షెడ్డులను తొలగించింది. 2 ఎకరాల పార్కు స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువుకు ఆనుకుని ఉన్న 5 ఎకరాల శ్మశానవాటిక, పక్కనే ఉన్న 4 ఎకరాల డంపింగ్ యార్డు ఆక్రమణలకు గురౌతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో విచారించింది. కూకట్‌పల్లి మండలంలోని బాగామేరి విలేజ్ సర్వే నంబరు 103లో ఉన్న ఈ భూమిని శ్మశానవాటికకు, చెత్త డంపింగ్ యార్డుకు కేటాయించిందిగా నిర్ధారించుకుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు 9 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. 5 ఎకరాలలో శ్మశాన వాటిక స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. ఆ పక్కనే ఉన్న 4 ఎకరాల్లో ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది.

## ప్రజలకు శుద్ధి జలాలు అందించాలి




**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** గ్రామాల్లోని ప్రజలకు శుద్ధిజాలాలు అందించాలని సిపిఎం మండల కమిటీ నాయకులు ఒడుగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని కేపీ పాలెం సౌత్ గ్రామంలో ఉన్న సచివాలయం వద్ద ప్రజలకు శుద్ధి జలాలు అందించాలని కోరుతూ సిపిఎం నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల, గ్యాస్ ధర, నిత్యావసర సరుకుల ధరల పెంపుతో గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు ప్రజలపై కొత్తగా గ్రామాల్లో తాగునీటి కుళాయి పన్ను సంవత్సరానికి రూ.600 పెంచి కట్టడం భారంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేపీ పాలెంలోని సమగ్ర మంచినీటి పథకం నుండి పైపుల ద్వారా తాగునీటి కుళాయిలకు బురద నీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. రెండు మూడు రోజులకు ఒకసారి 11 కుళాయిలకు తాగునీరు సరఫరా అవుతుందని, అవి కూడా మురికి నీరు రావడంతో తాగేందుకు ప్రజలు ప్రయివేటు వ్యక్తుల నుండి సుమారు రూ.30 వెచ్చించి కొనుగోలు చేసుకుని వినియోగించుకోవలసి వస్తుందన్నారు. శుద్ధి జలాలు అందించాలని కోరుతూ వినతి పత్రాన్ని కేపీ పాలెం సౌత్ సచివాలయ కార్యదర్శి దుర్గాభవానికి ఇచ్చేందుకు వెళ్తే ఆమె తిరస్కరించడం బాధాకరంగా ఉందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించవలసిన అధికారులే ఏమి పట్టనట్టుగా ఉండడం దారుణమని తెలిపారు. దీనిపై కార్యదర్శి దుర్గాభవాని ప్రశ్నించగా తమకు ఏవిధమైన సంబంధం లేదని, సిపిడబ్ల్యు స్కీం అధికారులకు మీ వినతి పత్రాలు ఇవ్వాలని ఆమె పొగరుగా సమాధానం చెప్పడం దారుణమన్నారు.

# ఆదివాసీల ఇళ్లకు అదనపు సాయమేది?



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** జిల్లాలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనంగా అందాల్సిన ఆర్థిక ప్రోత్సాహం కోసం సుమారుగా ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడంలో భాగంగా ప్రతి ఇంటి లబ్ధిదారునికి ఆర్థిక ప్రోత్సాహం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గిరిజన ప్రాంతంలోని ఆదిమ జాతి గిరిజన లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున, సాధారణ గిరిజన లబ్ధిదారులకు రూ.75 వేలు చొప్పున అందించాలని 2025 మార్చి 10న జీవోను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో తమ ఇళ్ల నిర్మాణానికి అదనపు ఆర్థిక సాయం అందుతుందని గిరిజన లబ్ధిదారులు సంబరపడ్డారు. కానీ ఇప్పటికీ అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక ప్రోత్సాహం కోసం ఉమ్మడి అల్లూరి జిల్లాలోని హౌసింగ్ లబ్ధిదారులు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. మామూలుగానే ప్రభుత్వం ఇచ్చే హౌసింగ్ స్కీమ్ సొమ్ముతో పాటు సొంతంగా మరికొంత సొమ్మును జోడి స్తేనే గాని ఇంటి నిర్మాణం పూర్తికాని పరిస్థితి. అయితే గిరిజనుల పేదరికం, ఆర్థిక స్థితిగతులను గుర్తించిన ప్రభుత్వం ఆదిమ జాతి గిరిజన లబ్ధిదారులకు రూ.లక్ష, సాధారణ గిరిజన లబ్ధిదారులకు రూ.75 వేలు చొప్పున ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని పేర్కొంది. దీంతో అందుకు తగ్గట్టుగా లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్ చేసుకుని పనులు చేపడుతున్నారు. కానీ ఏడాది గడుస్తున్నప్పటికీ ప్రత్యేక ప్రోత్సాహం ఊసే లేకపోవడంపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. అలాగే లబ్ధిదారులు తమ కాళ్లరిగేలా హౌసింగ్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 23 మండలాల పరిధిలో మొత్తం 37,617 మంది హౌసింగ్ లబ్ధిదారులకు రూ..347 కోట్లు ప్రత్యేక ప్రోత్సాహక నిధులు చెల్లించాల్సి ఉందని లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రధానమంత్రి జన్‌మన్ ఇళ్లకు సంబంధించి మొత్తం ఆదిమ జాతి గిరిజన లబ్ధిదారులు 28,691 మంది కాగా, వారిలో 26,147 మంది మాత్రమే రూ.లక్ష చొప్పున ప్రత్యేక ప్రోత్సాహానికి ఎంపికయ్యారు. దీంతో వారికి ప్రత్యేక ప్రోత్సాహకంగా రూ.261 కోట్లు చెల్లించాల్సి ఉంది. అలాగే రూ.75 వేలు చొప్పున ప్రత్యేక ప్రోత్సాహకానికి సంబంధించి సాధారణ గిరిజన లబ్ధిదారులు 11,470 మంది ఎంపికయ్యారు. వీరికి సంబంధించి రూ.86 కోట్లు నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండు కేటగిరీల్లోని 37,617 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.347 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం ఆ పెండింగ్ నిధులను విడుదల చేస్తే తమ ఇళ్లను పూర్తి చేసుకుంటామని లబ్ధిదారులు చెబుతున్నారు.

# గ్రామీణ పేదలపై ప్రత్యక్ష దాడి.. 125 రోజుల పని ఒట్టిదే




**అమరావతి, పతాకం న్యూస్:** వికసిత్ భారత్ గ్రామీణ ఉపాధి, జీవనోపాధుల పథకం (విబి - గ్రామ్‌జి) ఒక బూటకమని, ఇది గ్రామీణ పేదలపై మోడీ సర్కార్ సాగిస్తున్న ప్రత్యక్ష దాడి అని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికుల పొట్టగొట్టే ఈ పథకాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామీణ కుటుంబానికీ ఉపాధిని కనీసం 200 రోజులకు పెంచాలని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ నాడిక్కడ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఎంపీలు, ఆర్థికవేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఉపాధి హామీ కార్మికులతో వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాలు, ఎన్‌ఆర్‌ఇజిఎ సంఘర్ష్ మోర్చా ఐక్య వేదిక ఆధ్వర్యాన విధానాలపై చర్చ నిర్వహించింది. ఇటీవల ప్రవేశపెట్టిన విబి గ్రామ్‌జి -- 2025 దృష్ట్యా భారత గ్రామీణ ఉపాధి హామీ పథకం భవిష్యత్తుపై చర్చించింది. ఈ సందర్భంగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, లోక్‌సభ ఎంపీ అమ్రారామ్ మాట్లాడుతూ... మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసిన విబి గ్రామ్‌జిలో 125 రోజుల పని ఇస్తామన్న వాగ్దానం డొల్ల అని విమర్శించారు. కనీసం వంద రోజుల పని కూడా కల్పించలేని వారే 125 రోజుల పని కల్పిస్తామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రూ.15 లక్షలు ఇస్తామని చేసిన వాగ్దానం లాగే ఇది కూడా ఒక వట్టి హామీ అని అమ్రారామ్ అన్నారు. రాజ్యసభ ఎంపీ వి శివదాసన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని తొలగించడంతో వారు (కేంద్రం) గాంధీ ఆలోచనలను నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశ గ్రామీణ పేదల జీవనాధారమైన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కొనసాగిస్తున్న దాడులను సమావేశం ఖండించింది. ఉపాధి హామీ చట్టంలో ఉన్న హక్కులను తగ్గించడం, పనిదినాల గ్యారంటీని దెబ్బతీయడం, నిరుద్యోగ భృతి హక్కును నిర్వీర్యం చేయడంతో గ్రామీణ పేదల జీవనాధారంపై నేరుగా దాడి జరుగుతోందని తెలిపింది. కనీస వేతనం రూ.700గా నిర్ణయించి, దానిని ఏటా ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సవరించాలని, హాజరు, వేతన చెల్లింపుల కోసం వాడుతున్న, కార్మికులను మినహాయించే సాంకేతిక వ్యవస్థలను ఉపసంహరించుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. పనుల ప్రణాళిక, అమలు, పర్యవేక్షణలో గ్రామసభల పాత్రను పునరుద్ధరించి బలోపేతం చేయాలని తెలిపింది. దేశవ్యాప్తంగా ఉపాధి కార్మికులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, మే 15న సమ్మెతో పాటు పంచాయతీ కార్యాలయాల ఎదుట ఆందోళనలు, ముట్టడులు నిర్వహించాలని సమావేశం పిలుపునిచ్చింది. ఎంపీల సంతకాలతో ప్రధానమంత్రికి వినతి, పార్లమెంట్‌లో నిరసనలు చేపట్టడం వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. కనీసం 160 మంది ఎంపీల సంతకాలతో ప్రధానమంత్రికి మెమోరాండం సమర్పిస్తామని సదస్సులో ఐక్యవేదిక స్పష్టంగా ప్రకటించింది. బి వెంకట్ అధ్యక్షవర్గం తరఫున ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, ఎంపీలు జ్యోతిమణి, శశికాంత్ సెంథిల్ (కాంగ్రెస్), అరుణ్ నెహ్రూ (డిఎంకె), రాజా రామ్ సింగ్ (సిపిఐ ఎంఎల్), రాజ్ కుమార్ రావు (భారత్ ఆదివాసీ పార్టీ), సంజరు యాదవ్, మనోజ్ ఝా (ఆర్‌జెడి) కూడా పాల్గొన్నారు.

# డ్రగ్స్, గంజాయి మాఫియాను తరిమికొడదాం



**కడప, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్, గంజాయి మాఫియాను తరిమి కొడుదామని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి. రామన్న యువతకు పిలుపు నిచ్చారు. డివైఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జిల్లాలో నిర్వహించబోయే 'డ్రగ్స్, గంజాయి వద్దు.. ఆరోగ్యం, జీవితం ముద్దు' అంటు జీపు జాతాను ఎక్సైజ్ సిఐ సీతారామరెడ్డి, అర్బన్ ఎస్ఐ కొండారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయికృష్ణతో కలిసి ప్రారంభి ంచారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అధ్యక్షత నిర్వహించిన ప్రారంభ సభలో జి. రామన్న మాట్లాడుతూ ఎదుటి వారికి చెప్పేటందుకు నీతులు ఉన్నాయనే సామెత గుర్తు వస్తుందని ఎద్దేవా చేశారు. ఒక వైపు కూటమి ప్రభుత్వం డ్రగ్స్‌ను వందరోజుల్లో తరిమికొడుదాం అని పిలుపునిస్తే ఇంకోవైపు రెండు రోజుల కిందటే ఏలూరుకు చెందిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ డ్రగ్స్ పార్టీలో అడ్డంగా దొరికి ఒక రోజులోనే స్టేషన్ బెయిల్ తీసుకుని ఢిల్లీలో పార్లమెంటుకు వెళ్లారని పేర్కొన్నారు. సామాన్యుడు చిన్న తప్పు చేస్తే పెద్ద శిక్ష వేసే నీచమైన విధానం ఉండటం సభ్య సమాజం సిగ్గుపడేలా ఉందన్నారు. పుట్టా మహేష్ కుమార్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సాగుతున్న అక్రమ గంజాయి, డ్రగ్స్ రవాణాలో రాజకీయ నాయకుల అండదండలు సమృద్ధిగా ఉన్నాయని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్, గంజాయి పట్ల యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం చాక్లెట్, బిస్కెట్, డ్రింక్స్ రూపంలో విచ్చలవిడిగా డ్రగ్స్ గంజాయిని అలవాటు చేసి యువతను పాడుచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డీ-అడిక్షన్ సెంటర్ల పెంచాలని డిమాండ్ చేశారు. గంజాయి భారిగా పడిన యువతకు ప్రత్యమ్నాయ ఉపాధి చూపాలని కోరారు. గంజాయి కేసులో అమాయకులను కాకుండా అసలు దొంగలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈగల్ సెల్ ఏర్పాటు చేసి చేస్తున్న ప్రయత్నం చాలడం లేదన్నారు. డ్రగ్స్, గంజాయి వ్యాపారులు ఒక మాఫియాగా మారి, ప్రభుత్వం, పోలీసుల అండతోనే రెచ్చిపోతున్నారని తెలిపారు. గంజాయి మాఫియా వల్ల సామాన్యులకే కాదు నిజాయితీగా ఉండే పోలీస్ అధికారులకు సైతం రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి మాఫియాకు వ్యతిరేకంగా పోరాడిన పెంచలయ్య, తెలంగాణకు చెందిన ఎక్సైజ్ పోలీస్ కానిస్టేబుల్ సౌమ్య హత్యలే దీనికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి పై చేస్తుంది తక్కువ ప్రచారం ఎక్కువ అని అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజరు కుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ కడప జిల్లాకు యువత ఉక్కు పరిశ్రమ అడిగితే కూటమి ప్రభుత్వం మాత్రం గంజాయి, డ్రగ్స్ ను ఇస్తున్నారని తెలిపారు. కడప జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జీపుజాతా బద్వేలు, పోరుమావిళ్ల, బి. మఠం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మద్దనూరు, యర్రగుంట్ల, కమలాపురం, ఖాజీపేట మీదగా బుధవారం సాయంత్రానికి కడపకు చేరుతుందని తెలిపారు. ఈ జాతాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో, జిల్లా కార్యదర్శి నాగేంద్ర బాబు, యుఇఇయు అధ్యక్షులు శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జకరయ్య, ఆవాజ్ జిల్లా కార్యదర్శి చాంద్‌బాషా, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్, మండల కార్యదర్శి దేవదత్తం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు జి.అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గోవుల అక్రమ రవాణాకు చెక్

## పశువుల రవాణాకు ట్రాన్స్‌పోర్టు సర్టిఫికెట్ తప్పనిసరి



గోవుల అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపనున్నది. అనుమతులు లేకుండా గోవులను తరలించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. గోవులను రవాణా చేయాలంటే ఇక నుంచి తప్పనిసరిగా పశు సంవర్ధక శాఖ అధికారుల నుంచి 'డిజిటల్ ట్రాన్స్‌పోర్టు సర్టిఫికెట్' పొందాలన్న నిబంధన విధించింది. ఇందుకోసం 'డిజిటల్ ట్రాన్స్‌పోర్టు సర్టిఫికెట్ జనరేషన్ సిస్టం'ను అమల్లోకి తెచ్చింది. దీనివల్ల పశువుల అక్రమ రవాణాతోపాటు గోవధకు అడ్డుకట్టపడుతుందని హిందూ సంఘాలు, గోపరిరక్షణ సంఘాల ప్రతినిధులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్రవ్యాప్తంగా గోవుల అక్రమ రవాణా, కబేళాలకు తరలింపు యథేచ్ఛగా సాగుతున్నాయి. గోవులను చంపడానికి వీల్లేదని, కేవలం ఎద్దులు, గేదెలు, దున్నలు వంటి వాటిని ప్రభుత్వ వైద్యుడి పర్యవేక్షణలో అనుమతించిన కబేళాలో మాత్రమే వధించాలని స్పష్టమైన నిబంధన ఉంది.

అయితే కొంతమంది డబ్బు సంపాదనే పరమావధిగా ఎద్దులు, గేదెలు, దున్నలతోపాటు ఆవులను కూడా అక్రమంగా కబేళాలకు తరలిస్తున్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించే క్రమంలో నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. వాహనాల్లో ఆవులను కిక్కిరిసి ఎక్కించి, గమ్యస్థానం చేరేంత వరకూ వాటికి నీరు, ఆహారం ఇవ్వడం లేదు. దీంతో ఊపిరాడక, గొంతు ఎండిపోయి కొన్ని మార్గమధ్యంలోనే మృత్యువాత పడుతున్నాయి. ఉత్తరాంధ్రలోని పలు సంతల్లో దళారులు ఆవులను కొనుగోలు చేసి మినీ వ్యాన్‌లలో విశాఖ నగరానికి రవాణా చేస్తున్నారు.

పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు ఆయా సంతల నుంచి రాత్రి పది గంటల తరువాత బయలుదేరి, తెల్లవారుజామున మూడు గంటల్లోపు గమ్యస్థానాలకు చేరేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అనంతరం వాటిని జనావాసాల మధ్యనే వధించి, గుట్టుచప్పుడు కాకుండా మాంసాన్ని పలు దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. హిందువులు పరమపవిత్రంగా భావించే గోవులను హింసించడం, వధించడంపై హిందూత్వ సంఘాలతోపాటు గోపరిరక్షణ సంఘాల ప్రతినిధులు పోరాటం చేస్తున్నాయి. గోవులను రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుని పోలీసులకు అప్పగిస్తున్నారు. అయితే గోవుల రవాణా వెనుక బడా వ్యాపారులతో కూడిన మాఫియా ఉండడంతో...పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి, తిరిగి కబేళాలకు తరలించేలా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ప్రజల నుంచి విమర్శలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. గోవుల అక్రమ రవాణా, వధకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన నిబంధనలను విధించాలని నిర్ణయించింది. ఇకపై గోవులతోపాటు ఇతర పశువులను వాహనాల్లో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించాలంటే పశు సంవర్ధక శాఖ జారీచేసే 'డిజిటల్ ట్రాన్స్‌పోర్టు సర్టిఫికెట్'ను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఎవరైనా పశువులను రవాణా చేయాలంటే ముందుగా పశువుల సంఖ్య, వాటి వివరాలతోపాటు వాహనం నంబర్, సమయం, ఎక్కడి నుంచి ఎక్కడకు తీసుకువెళుతున్నారనే వివరాలను పశు సంవర్ధక శాఖకు అందజేయాల్సి ఉంటుంది. ఆ వివరాలను పరిశీలించిన తర్వాత రవాణాకు అనుమతిస్తూ 'డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ సర్టిఫికెట్'ను జారీచేస్తుంది. ఆ సర్టిఫికెట్‌ను ప్రింట్ తీసుకుని లేదా మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని వాహనంతోపాటు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. మార్గమధ్యంలో పోలీసులు, రవాణాశాఖ అధికారులు అడిగితే ఆ సర్టిఫికెట్‌ను చూపించాల్సి ఉంటుంది. ఒకవేళ సర్టిఫికెట్ తీసుకోకుండా పశువులను రవాణా చేస్తే పోలీస్, రవాణా శాఖ అధికారులు కేసు నమోదుచేసి క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా చర్యలతో ఉత్తరాంధ్రలో పశువుల అక్రమ రవాణాకు, గోవధకు అడ్డుకట్టపడుతుందని హిందూత్వ సంఘాలు, గోపరిరక్షణ సంఘాల ప్రతినిధులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నాయి.

# హోర్ముజ్ జలసంధి సమీపంలో అమెరికా భీకర దాడులు



**ఇరాన్:** పశ్చిమాసియాలో యుద్ధం ముదురుతోంది. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి (హ్‌ర్భుఖ్ శీట ఎశీతీఎబఓ) వద్ద పట్టు సాధించేందుకు అమెరికా సరికొత్త యుద్ధ తంత్రాన్ని అమలుచేస్తోంది. ఇరాన్ ఆధీనంలో ఉన్న వ్యూహాత్మక భూగర్భ క్షిపణి స్థావరాలే లక్ష్యంగా అగ్రరాజ్యం 'బంకర్ బస్టర్' బాంబులతో విరుచుకుపడింది. అంతర్జాతీయ నౌకాయానానికి ముప్పుగా మారిన ఇరాన్ యాంటీ-షిప్ క్రూయిజ్ క్షిపణులను అడ్డుకునేందుకు ఈ దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది. ఈ దాడిలో దాదాపు 2,200 కిలోల బరువున్న అత్యంత శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబులను అమెరికా ప్రయోగించింది. హోర్ముజ్ జలసంధికి యుద్ధ నౌకలను పంపే విషయంలో నాటో , ఇతర మిత్రదేశాలు వెనకడుగు వేశాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటల వ్యవధిలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. మిత్రదేశాల సహకారం లేకపోయినా, ఒంటరిగానే ఇరాన్‌ను ఎదుర్కొంటామనే సంకేతాన్ని అమెరికా ఈ చర్యతో పంపింది. సాధారణ బాంబులు భూ ఉపరితలంపై మాత్రమే ప్రభావం చూపుతాయి. కానీ, బంకర్ బస్టర్లు భూమిలోకి లోతుగా చొచ్చుకుపోయి, అక్కడున్న కాంక్రీట్ కట్టడాలను, భూగర్భ స్థావరాలను ధ్వంసం చేస్తాయి. 2022 గణాంకాల ప్రకారం, ఒక్కో బాంబు తయారీకి దాదాపు 2.88 లక్షల డాలర్లు (సుమారు రూ. 2.6 కోట్లు) ఖర్చవుతుంది. గతేడాది ఇరాన్ అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నప్పుడు అమెరికా ఏకంగా 13,600 కిలోల భారీ బాంబులను ఉపయోగించింది. ఈ దాడుల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి గుండా జరిగే చమురు సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్నాయి. ఇరాన్ దీనిపై ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు ప్రపంచ దేశాల్లో ఉత్కంఠ రేపుతోంది.

# జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే..!

జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండి సరిగ్గా పనిచేయాలంటే.. ఈ ఆహారాలను రోజూ తీసుకోవాలి.. ఫైబర్ శరీరానికి చాలా అవసరం. జీర్ణవ్యవస్థకు ఫైబర్ ఒక రాజు వంటిది అని చెప్పవచ్చు. కానీ అన్ని ఫైబర్‌లు ఒకేలా ఉండవు. ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరంతో పాటు అజీర్తి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఫైబర్ శరీరానికి చాలా అవసరం. జీర్ణవ్యవస్థకు ఫైబర్ ఒక రాజు వంటిది అని చెప్పవచ్చు. కానీ అన్ని ఫైబర్‌లు ఒకేలా ఉండవు. ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరంతో పాటు అజీర్తి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కనుక కడుపుకు ఇబ్బంది లేకుండా, కడుపు ఉబ్బరం రాకుండా, శరీరానికి స్థిరమైన శక్తిని ఇచ్చే అధిక ఫైబర్ ఉన్న స్నాక్స్ తీసుకోవడం మంచిది అని వైద్యులు చెబుతున్నారు. కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు చాలా మందిలో సాధారణంగా కనిపిస్తాయి. అలాంటి వారు ఈ స్నాక్స్ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. అమెరికన్ డైటరీ గైడ్‌లైన్స్ ప్రకారం, రెండు సంవత్సరాల పైబడిన వ్యక్తులు రోజుకు తీసుకునే ప్రతి 1,000 కేలరీలకు సుమారు 14 గ్రాముల ఫైబర్ తీసుకోవాలి. 12 నెలల నుంచి 23 నెలల మధ్య ఉన్న పిల్లలకు రోజుకు 19 గ్రాముల ఫైబర్ ఇవ్వాలి. ఫైబర్ ఆరోగ్యానికి చాలా అవసరం అయినప్పటికీ, అధిక ఫైబర్ ఉన్న ప్రతి ఆహారం సులభంగా జీర్ణం అవ్వాలని లేదు. కనుక తరచూ కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడే వారు జీర్ణ ఆరోగ్యానికి సహాయపడే విత్తనాలు, గింజలు, సంపూర్ణ ధాన్యాలు,



పండ్లు తీసుకోవడం మంచిది. ఫైబర్ అధికంగా ఉండడంతో పాటు కడుపు ఉబ్బరాన్ని తగ్గించి జీర్ణ వ్యవస్థకు మేలు చేసే కొన్ని ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.జీర్ణ వ్యవస్థ మార్గదర్శకాలు

గుమ్మడికాయ గింజలు, సబ్జా గింజలు, పొడి చేసిన అవిసె గింజలు, చియా గింజలు వంటి వాటిలో ఫైబర్ అధికంగా ఉండడంతో పాటు వీటిని తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. అలాగే కొన్ని రకాల గింజల్లో ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ సులభంగా జీర్ణమవుతాయి. వాల్‌నట్స్, డ్రై రోస్టెడ్ పల్లీలు, మఖానా వంటివి సులభంగా జీర్ణమవ్వడంతో పాటు వీటిలో ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. అలాగే బటర్, నెయ్యి వంటివి వేయకుండా ఎయిర్ పాప్ చేసిన పాప్ కార్న్ వంటి స్నాక్స్ కూడా తీసుకోవచ్చు. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పాటు సులభంగా జీర్ణమవుతాయి. అదే విధంగా స్ప్రౌటెడ్ బ్రెడ్, సవర్డో బ్రెడ్, స్టీల్-కట్ ఓట్స్ వంటి సంపూర్ణ ధాన్యాలతో చేసిన ఆహారాలు కూడా జీర్ణవ్యవస్థకు అనుకూలంగా ఉండడంతో పాటు శరీరానికి ఎక్కువసేపు శక్తిని అందిస్తాయి. టెంపెహ్, ఫర్మ్ లేదా ఎక్స్‌ట్రా-ఫర్మ్ టోఫు వంటి మొక్క ఆధారిత ప్రోటీన్ ఆహారాలు సంతృప్తికరమైనవి. ఇవి తక్కువ ఉబ్బరాన్ని కలిగిస్తాయి. వీటిని ఫైబర్ అధికంగా ఉండే డైట్‌తో కలిపి తింటే కడుపుకు తేలికగా ఉంటుంది.జీర్ణ వ్యవస్థ మద్దతు

ఇక పండ్లు, కూరగాయలు సులభంగా జీర్ణం అవ్వడంతో పాటు అధిక ఫైబర్ ను కలిగి ఉంటాయి. ఉడికించిన క్యారెట్, బ్లూబెరీస్, స్ట్రాబెరీస్, రాస్ప్‌బెరీస్, కివీ పండు, ఆరెంజ్, మాండరిన్, కొంచెం పచ్చగా ఉన్న అరటిపండు, బొప్పాయి వంటి ఆహారాలు సులభంగా జీర్ణమవ్వడంతో పాటు కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తాయి. ఇటువంటి ఆహారాల్లో ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పాటు పొట్టకు కూడా తేలికగా ఉంటాయి. కడుపు ఉబ్బరంతో పాటు ఇతర జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడే వారు సులభంగా జీర్ణమవ్వడంతో పాటు ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాలను గట్ ఫ్రెండ్లీ స్నాక్స్ ను ఎంచుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.




## నేడు థియేటర్స్‌లోకి రానున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'



పవర్ స్టార్ పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్టయినర్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు రంగం సిద్ధమైంది. ముందుగా ప్రకటించిన తేదీ కంటే వారం ముందే, ఉగాది పండుగ కానుకగా మార్చి 19న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో దేశవిదేశాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాగా, అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.

నైజాం (తెలంగాణ) వ్యాప్తంగా ఈ చిత్ర అడ్వాన్స్ బుకింగ్స్ మొదలయ్యాయి. అయితే, టికెట్ ధరలు పెంచకుండా సాధారణ రేట్లకే సినిమాను విడుదల చేయాలని మేకర్స్ నిర్ణ యించినట్టు తెలుస్తోంది. దీని ప్రకారం సింగిల్ స్క్రీన్లలో గరిష్ఠంగా రూ.175, మల్టీ ప్లెక్స్‌లలో రూ.300గా ధరలు ఉన్నాయి. మరో వైపు, ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 19న తెల్ల వారుజామున ప్రద ర్శించే బెనిఫిట్ షో లకు రూ.500 టికెట్ ధరకు ప్రభుత్వం అనుమ తినిచ్చింది. విదేశాల్లోనూ 'ఉస్తాద్' హవా కనిపిస్తోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా ఇప్పటికే రూ. 2.31 కోట్లకు పైగా వసూలయ్యాయి. దాదాపు రూ.127 కోట్ల ప్రీ-రిలీజ్ థియేట్రికల్ బిజినెస్ చేసిన ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం, మార్చి 18న నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోలతో సందడి మొదలుపెట్టనుంది.

## అక్టోబర్ 2న 'ఆదర్శ కుటుంబం'



వెంకటేష్ త్రివిక్రమ్ కాంబోలో రాబోతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రం అక్టోబర్ 2న విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఈ సినిమా షూటింగ్‌ని ఇప్పటికే 40 శాతం పూర్తి చేశారు. మిగిలిన చిత్రీకరణ దుబారులో చిత్రీకరించాల్సి వుంది. అయితే ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా, ఈ దుబాయ్ షెడ్యూల్‌లో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. భద్రతా కారణాల దృష్ట్యా లేదా ఇతర కారణాల వల్ల షూటింగ్ లొకేషన్‌ను మార్చాలా? లేక షెడ్యూల్‌ను వాయిదా వేయాలా? అనే సందిగ్ధంలో చిత్రబృందం వుంది. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. నారా రోహిత్ కీలకపాత్రలో కనిపించనున్నారు. తమిళ హాస్య నటుడు యోగిబాబు కూడా ఒక పాత్రలో నటిస్తున్నారు.

## నా అనుమతి లేకుండానే ఆ పని చేశారు.. వివాదాస్పద పాటపై నోరా ఫతేహి క్లారిటీ



బాలీవుడ్ నటి, డ్యాన్సర్ నోరా ఫతేహి... 'కేడీ: ది డెవిల్' సినిమాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాటపై చెలరేగిన వివాదంపై ఎట్టకేలకు స్పందించారు. ఈ పాట హిందీ వెర్షన్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, దాని నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ఓ వీడియో సందేశం ద్వారా స్పష్టం చేశారు. ఈ పాటను తన అనుమతి లేకుండానే హిందీలో డబ్ చేసి విడుదల చేశారని ఆమె ఆరోపించారు. ఈ పాటను తాను మూడేళ్ల క్రితం కన్నడలో షూట్ చేశానని, దానిని తర్వాత ఎలా మారుస్తారో తనకు తెలియదని నోరా తెలిపారు. "ఇది ఒక పెద్ద సినిమా కావడం, సంజయ్ దత్ లాంటి స్టార్ ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌కు ఒప్పుకున్నాను. వాస్తవానికి ఇది 'నాయక్ నహీ ఖల్నాయక్ హూ మెయిన్' పాటకు రీమేక్ అనుకున్నాను" అని ఆమె వివరించారు. కన్నడలో సాహిత్యం తనకు అర్థం కాకపోవడంతో వారు చెప్పిందే నమ్మానని, అందులో అసభ్యత ఏమీ అనిపించలేదని అన్నారు.

## బుమ్రా కాంట్రాక్ట్‌పై బీసీసీఐ పునరాలోచన!



బీసీసీఐ ఇటీవలే టీమిండియా ప్లేయర్ల కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంతకుముందు ఉన్న ఏ ప్లస్ కేటగిరినీ బీసీసీఐ పూర్తిగా తొలగించింది. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా ఈ కేటగిరీలోనే ఉండేవారు. వారికి ఏడాదికి రూ.7 కోట్లను బోర్డు పారితోషికంగా చెల్లించేది. అయితే ఏ ప్లస్ కేటగిరీని తొలగించడంతో బుమ్రా ఏ కేటగిరీకి వచ్చాడు. దీనికి రూ.5 కోట్లు మాత్రమే బోర్డు చెల్లించనుంది. దీంతో అన్ని ఫార్మాట్లలో ఆడుతున్న బుమ్రా దాదాపు రూ.2 కోట్లను కోల్పోతున్నాడు. బుమ్రా కాంట్రాక్ట్‌పై బీసీసీఐ పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అతడు నష్టపోతున్న రూ.2కోట్లను పరిహారంగా కింద బీసీసీఐ ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో పాటు మరికొందరు ఆటగాళ్ల ప్రదర్శనను కూడా దృష్టిలో పెట్టుకుని వారి కాంట్రాక్టు మొత్తాలను కూడా బీసీసీఐ పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై బీసీసీఐ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. టీమిండియా టీ20 ఫార్మాట్ వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా బీసీసీఐ పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అక్షర్ ప్రస్తుతం గ్రేడ్ సిలో ఉన్నాడు. అతడు కేవలం రూ.కోటి మాత్రం అందుకుంటున్నాడు. అయితే గతంలో ఏ ప్లస్ కేటగిరీ దక్కించుకోవాలంటే క్రికెటర్లు మూడు ఫార్మాట్లలో ఆడుతూ, కనీసం ఒక్క ఫార్మాట్లో అయినా టాప్ 10 ర్యాంకింగ్‌లో ఉండాలనే నిబంధన ఉండేది. విరాట్, రోహిత్ శర్మ టెస్టు, టీ20లకు వీడ్కోలు పలికి కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వారు బీ కేటగిరీలో ఉన్నారు. కాగా ఏ కేటగిరీలో శుభ్‌మన్ గిల్, జడేజా, బుమ్రా కొనసాగుతున్నారు.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ రిలీజ్.. కోహ్లీ, రోహిత్ స్థానాలు ఇవే



అత్యుత్తమ ఆటగాళ్ల ర్యాంకులను తాజాగా ఐసీసీ ప్రకటించింది. వన్డే ర్యాంకుల్లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. ఇటీవల వన్డేలను ఆడకపోయినా సరే.. బ్యాటర్ల విభాగంలో విరాట్ కోహ్లీ (2), రోహిత్ శర్మ (4), శుభ్‌మన్ గిల్ (5) టాప్-5లో కొనసాగుతున్నారు. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. పాకిస్థాన్‌పై వన్డే సిరీస్‌ను గెలిపించిన బంగ్లా సారథి మెహిదీ హసన్ మిరాజ్ బౌలర్ల లిస్ట్‌లో తొమ్మిది స్థానాలను ఎగబాకి ఏడో ర్యాంకుకు చేరాడు.

ఇక వన్డే బౌలర్ల జాబితాలో భారత్ నుంచి కుల్‌దీప్ యాదవ్ ఒక్కడే 8వ స్థానంతో టాప్-10లో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో మిరాజ్ రెండు స్థానాలు పైకొచ్చి రెండో ర్యాంకులో నిలిచాడు. ఇక్కడ టాప్-10లో టీమిండియా నుంచి అక్షర్ పటేల్ పదో ర్యాంకుతో కొనసాగుతున్నాడు. జట్ల పరంగా టెస్టు ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానంలో ఉన్న భారత్.. వన్డే, టీ20 ఫార్మాట్లలో నెంబర్ వన్ స్థానంలో ఉంది.

ఇక టీ20 బౌలింగ్ విభాగంలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒక ర్యాంకును మెరుగుపర్చుకుని టాప్-5లోకి వచ్చాడు. అఫ్గాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (753), వరుణ్ చక్రవర్తి (740) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఇక బ్యాటింగ్ జాబితాలో ఎలాంటి మార్పులు లేవు. భారత యువ హిట్టర్లు అభిషేక్ శర్మ (875), ఇషాన్ కిషన్ (871) తొలి రెండు స్థానాలను పదిలం చేసుకున్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే ఆటగాడు సికందర్ రజా, భారత స్టార్ ప్లేయర్ హార్దిక్ పాండ్యవే తొలి రెండు స్థానాలు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**